Neti Velugu
నేటి వెలుగు
నేటి సమాజం... నేటి వెలుగు...
తెలుగు దినపత్రిక
RNI NO. TELTEL/2023/88559
www.epaper.netivelugu.com
netivelugu63@gmail.com

హైదరాబాద్ శివార్లలో అక్రమ బోర్లను టార్గెట్ చేసిన హైడ్రా

2



నల్గొండ | సంపుటి : 3 | సంచిక : 199 | పేజీలు : 8 | నవంబర్ 3 మంగళవారం 2026 | వెల రూ. 4.00/-

NALGONDA | VOL:3 | ISSUE: 199 | PAGES:8 | TUESDAY NOVEMBER 3 2026 | Rs. 4:00

లక్ష మంది విద్యార్థులకు ఉచిత ఏఐ, క్లౌడ్ శిక్షణ



ఏడబ్ల్యూఎస్ సహకారంతో టాస్క్ ఆధ్వర్యంలో కార్యక్రమం

రాష్ట్రంలోని 643 అనుబంధ కళాశాలల్లో శిక్షణ

900కు పైగా డిజిటల్ కోర్సులు ఉచితంగా అందుబాటులోకి

శిక్షణ పూర్తిచేసిన అర్హులకు ప్రత్యేక జాబ్ మేళాలు

హైదరాబాద్, నవంబరు 2:లిలి తెలంగాణలో లక్ష మంది విద్యార్థులకు ఉచితంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), క్లౌడ్ కంప్యూటింగ్‌లో శిక్షణ అందించనున్నట్లు ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు వెల్లడించారు. 'తెలంగాణ ఏఐ అండ్ క్లౌడ్ స్కిల్లింగ్ ఇనిషియేటివ్'లో భాగంగా అమెజాన్ వెబ్ సర్వీసెస్ (ఏడబ్ల్యూఎస్) సహకారంతో టాస్క్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ శిక్షణ కో(మిగతా 2వ పేజీలో..)

త్రివర్ణ పతాకం చేతబూని హైదరాబాద్‌లో అమిత్ షా పాదయాత్ర.. కదంతొక్కిన కాషాయ శ్రేణులు



'ఇండియా' కూటమికి వ్యతిరేకంగా హైదరాబాద్‌లో కేంద్ర మంత్రి అమిత్ షా మహా పాదయాత్ర

బషీర్‌బాగ్ నుంచి మొజాంజాహీ మార్కెట్ వరకు 1.5 కిలోమీటర్ల మేర పాదయాత్ర

పాదయాత్రకు ముందు చార్మినార్ భాగ్యలక్ష్మి ఆలయంలో అమిత్ షా ప్రత్యేక పూజలు

కాంగ్రెస్ తీరుపై సోషల్ మీడియా వేదికగా అమిత్ షా తీవ్ర విమర్శలు

కేంద్ర హోంమంత్రి అమిత్ షా సోమవారం హైదరాబాద్‌లో మహా పాదయాత్ర చేపట్టారు. 'ఇండియా' కూటమి చేపట్టిన ప్రచారాన్ని తిప్పికొట్టే లక్ష్యంతో బీజేపీ దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న కార్యక్రమంలో భాగంగా ఈ పాదయాత్ర సాగింది. 'ప్రజాస్వామ్యాన్ని కాపాడండి, అరాచకాన్ని తొలగించండి' అనే నినాదంతో ఈ ర్యాలీని నిర్వహించారు.నగరంలోని బషీర్‌బాగ్‌లో ఉన్న బాబూ జగ్జీవన్ రామ్ విగ్రహం వద్ద ఈ పాదయాత్ర ప్రారంభమైంది. జాతీయ జెండా చేతబూని అమిత్ షా ముందుకు సాగగా, ఆయనతో పాటు కేంద్ర మంత్రులు జి. కిషన్ రెడ్డి, బండి సంజయ్ కుమార్, తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు, పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, వందలాది మంది కార్యకర్తలు పాల్గొన్నారు. సుమారు 1.5 కిలోమీటర్ల మేర సాగే ఈ పాదయాత్ర మొజాంజాహీ మార్కెట్ వద్ద ముగియనుంది. అక్కడ జరిగే కార్నర్ మీటింగ్‌లో అమిత్ షా ప్రసంగించనున్నారు. ఢిల్లీలో ఆదివారం 'ఇండియా' కూటమి నిర్వహించిన ర్యాలీలో బీజేపీపై చేసిన విమర్శలకు ఆయన ఇక్కడ దీటైన సమాధానం ఇచ్చే అవకాశం ఉంది.పాదయాత్రకు ముందు, కాంగ్రెస్ పార్టీని లక్ష్యంగా చేసుకుని అమిత్ షా సోషల్ మీడియా వేదికగా తీవ్ర విమర్శలు చేశారు. "వరుస ఓటములతో కుంగిపోయిన కాంగ్రెస్, ఇప్పుడు అరాచక చర్యలతో ప్రజాస్వామ్యాన్ని హత్య చేసి అయినా సరే అధికారాన్ని దక్కించుకోవాలని చూస్తోంది. కాంగ్రెస్ కుట్రపూరిత ప్రయత్నాల నుంచి మన ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకే

నవంబర్ 11 నుంచి కేటీఆర్ బస్సు యాత్ర.. 29న భారీ బహిరంగ సభ



కేటీఆర్ సారథ్యంలో బీఆర్ఎస్ బస్సు యాత్రకు సన్నాహాలు

రైతుల సాగునీటి కష్టాలను ఎండగట్టడమే లక్ష్యం

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బస్సుయాత్రకు సిద్ధమవుతున్నారు. ఈ విషయాన్ని బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి గంగుల కమలాకర్ వెల్లడించారు. నవంబర్ 11 నుంచి 14వ తేదీ మధ్య రెండు రోజుల పాటు కేటీఆర్ బస్సు యాత్ర చేపడతారని తెలిపారు. మేడిగడ్డ నుంచి ప్రారంభమయ్యే ఈ యాత్ర, గోదావరి పరీవాహక ప్రాంతంలోని ప్రధాన సాగునీటి ప్రాజెక్టుల మీదుగా సాగుతుందని వివరించారు. ప్రాజెక్టుల ప్రస్తుత పరిస్థితిని పరిశీలిస్తూ, రైతుల ఇబ్బందులను ఆధారాలతో ప్రజలకు వివరిస్తామని పేర్కొన్నారు.మరోవైపు, తెలంగాణ ఉద్యమంలో చారిత్రక ఘట్టమైన దీక్షా దివస్‌ను పురస్కరించుకుని నవంబర్ 29న భారీ బహిరంగ సభ నిర్వహించాలని నిర్ణయించినట్లు గంగుల తెలిపారు. 2009లో కేసీఆర్‌ను అరెస్టు చేసిన అలుగునూరు లేదా నుస్తులాపూర్ ప్రాంతంలో ఈ సభను ఏర్పాటు చేయనున్నామన్నారు. ఈ సభకు సుమారు 50 వేల మంది ప్రజలను సమీకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు.

హైదరాబాద్ మెట్రోకు నిధుల జోరు.. ఫేజ్-2కు రూ.150 కోట్లు



మెట్రో ఫేజ్-2కు రూ.150 కోట్లు మంజూరు

ఫేజ్-2 అధ్యయనాలు, సర్వేలకు నిధుల వినియోగం

ఎయిర్‌పోర్టు నుంచి పాతబస్తీ వరకు.. మెట్రో రెండో దశకు ఊతం

హైదరాబాద్‌లో పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీకి పరిష్కారం చూపడంతో పాటు ప్రజా రవాణా వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది.

(మిగతా 2వ పేజీలో..)

ఓట్ చోరీ జరిగితే రాహుల్, రేవంత్ ఎలా గెలిచారు?: రాంచందర్ రావు

కేరళలో కాంగ్రెస్ విజయాన్ని ప్రస్తావించిన భాజపా రాష్ట్ర అధ్యక్షుడు

అమిత్ షా హైదరాబాద్ పర్యటనతో ఆరోపణలకు సమాధానం ఇస్తారని వెల్లడి

అమిత్ షా పాదయాత్రకు లక్ష మందికి పైగా వచ్చే అవకాశం ఉందని అంచనా

వచ్చే ఎన్నికల్లో తెలంగాణలో భాజపాదే అధికారమని ధీమా

ఓట్ చోరీ ఆరోపణలపై భాజపా తెలంగాణ అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు కాంగ్రెస్‌పై



(మిగతా 2వ పేజీలో..)

చెత్తరహిత, ట్రాఫిక్ ఫ్రీ హైదరాబాద్ లక్ష్యం: సీఎం

నగరంలో ఎక్కడా చెత్త కనిపించకూడదు

ప్రతిరోజూ ఇంటింటికీ చెత్త సేకరణ తప్పనిసరి

సిగ్నల్ ఫ్రీ ట్రాఫిక్ కోసం అండర్‌పాస్‌లు, ఎలివేటెడ్ కారిడార్లు



హైదరాబాద్: భాగ్యనగరాన్ని పరిశుభ్రమైన, ట్రాఫిక్ సమస్యలు లేని నగరంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. నగరంలో ఎక్కడా చెత్త కనిపించకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రతిరోజూ ప్రతి ఇంటి నుంచి చెత్త సేకరణ జరగాల్సిందేనని తేల్చిచెప్పారు. ఈ విషయంలో నిర్లక్ష్యం వహించే అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సోమవారం మున్సిపల్ శాఖ ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో నగర పారిశుధ్యం, చెత్త నిర్వహణ, ట్రాఫిక్ సమస్యలపై సీఎం దిశానిర్దేశం చేశారు.

నిర్మాణ వ్యర్థాల తరలింపునకు ప్రత్యేక చర్యలు

హైదరాబాద్‌లో (మిగతా 2వ పేజీలో..)

రాప్తాడు దాడిలో గాయపడిన బాలిక ఆరోగ్యంపై మంత్రి లోకేశ్ కీలక అప్‌డేట్

రాప్తాడు దాడిలో గాయపడిన బాలిక ఆరోగ్యంలో పురోగతి ఉందన్న మంత్రి లోకేశ్

స్పృహలోకి వచ్చిన బాలికను తల్లి పరామర్శించిందని వెల్లడి

వైద్యుల పర్యవేక్షణలో చికిత్స కొనసాగుతుందని మంత్రి పోస్ట్



స్నేహితురాలు లక్ష్మికి కూడా ఆసుపత్రిలో చికిత్స అందుతోందని వెల్లడి

రాప్తాడు జడ్పీ హైస్కూల్‌లో జరిగిన దాడిలో తీవ్రంగా గాయపడిన బాలిక ఆరోగ్యం క్రమంగా మెరుగుపడుతోందని మంత్రి నారా లోకేశ్ తెలిపారు.

(మిగతా 2వ పేజీలో..)

ఏపీ తీరం వైపు 'మురసు'.. పోర్టుల్లో పెను ప్రమాద హెచ్చరికలు.. దక్షిణ కోస్తాలో రెడ్ అలర్ట్

'మురసు' తుపానుతో కోస్తాంధ్ర అలజడి

నిజాంపట్నం, వాడరేవు పోర్టులకు 10వ నంబర్ ప్రమాద హెచ్చరిక

ఒంగోలు సమీపంలో తీరం దాటనున్న తీవ్ర తుపాను

బాపట్ల సహా పలు జిల్లాల్లో విద్యాసంస్థలకు సెలవులు ప్రకటించిన ప్రభుత్వం

రైళ్లు, విమాన సర్వీసులపై తీవ్ర ప్రభావం

బంగాళాఖాతంలో ఏర్పడిన 'మురసు' తీవ్ర తుపాను ఆంధ్రప్రదేశ్ తీరం వైపు వేగంగా దూసుకొస్తుండటంతో అధికార యంత్రాంగం పూర్తిస్థాయిలో అప్రమత్తమైంది. తుపాను తీవ్రతను సూచిస్తూ కోస్తాంధ్రలోని ప్రధాన ఓడరేవుల్లో ప్రమాద హెచ్చరికలను జారీ చేశారు. ముఖ్యంగా, బాపట్ల జిల్లాలోని నిజాంపట్నం, వాడరేవు ఓడరేవుల్లో అత్యంత తీవ్రతను సూచించే 10వ నంబర్ ప్రమాద హెచ్చరికను



ప్రదర్శించారు. అదేవిధంగా, మచిలీపట్నం పోర్టులో 9వ నంబర్, కృష్ణపట్నం పోర్టులో 8వ నంబర్ సిగ్నల్స్ జారీ చేశారు. విశాఖపట్నం, భీమునిపట్నం, గంగవరం, కాకినాడ, కళింగపట్నం ఓడరేవుల్లో 3వ నంబర్ హెచ్చరికలను కొనసాగిస్తున్నారు.గత 6 గంటలుగా ఈ తుపాను గంటకు 10 కిలోమీటర్ల వేగంతో పశ్చిమ-వాయవ్య దిశగా కదులుతోంది. సోమవారం మధ్యాహ్నం నాటికి ఇది నెల్లూరుకు 100 కి.మీ, కావలికి 120 కి.మీ, ఒంగోలుకు 160 కి.మీ దూరంలో కేంద్రీకృతమై ఉంది. వాతావరణ శాఖ అంచనాల ప్రకారం, సోమవారం (మిగతా 2వ పేజీలో..)

ఓబీసీ గణనపై తీర్మానం చేయండి: సీఎం రేవంత్‌కు కవిత బహిరంగ లేఖ

ప్రత్యేక అసెంబ్లీ సమావేశాలు ఏర్పాటు చేయాలని డిమాండ్

జనగణనలో ఓబీసీ కులగణనపై తీర్మానం చేయాలని విజ్ఞప్తి

ఆదివాసీల మతానికి ప్రత్యేక కాలమ్ చేర్చాలని సూచన

జాతీయ జనగణనలో ఓబీసీల కులగణన చేపట్టేలా కేంద్రంపై ఒత్తిడి తెచ్చేందుకు శాసనసభ, శాసనమండలి ప్రత్యేక సమావేశాలు



(మిగతా 2వ పేజీలో..)

నేటి వెలుగు
నేటి సమాజం... నేటి వెలుగు...
తెలుగు దినపత్రిక
పి. నవీన్ కుమార్ గౌడ్
ఎడిటర్ & పబ్లిషర్

త్రివర్ణ పతాకం చేతబూని హైదరాబాద్‌లో అమిత్ షా పాదయాత్ర.. కదంతొక్కిన కాషాయ శ్రేణులు

మొదటి పేజీ తరువాయి)

ఈ మహా పాదయాత్రలో పాల్గొంటున్నాను" అని ఆయన 'ఎక్స్'లో పేర్కొన్నారు. నగర పర్యటనలో భాగంగా, తొలుత అమిత్ షా చారిత్రక చార్మినార్ వద్ద ఉన్న భాగ్యలక్ష్మి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అంతకుముందు బేగంపేట విమానాశ్రయానికి చేరుకున్న ఆయనకు కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్, ఇతర బీజేపీ నేతలు ఘన స్వాగతం పలికారు. పాదయాత్ర నేపథ్యంలో బషీర్‌బాగ్, నాంపల్లి, అబిడ్స్, కోఠి, అఫ్జల్‌గంజ్ సహా పలు ప్రాంతాల్లో పోలీసులు ట్రాఫిక్ ఆంక్షలు విధించి, వాహనాలను దారి మళ్లించారు.

రాప్తాడు దాడిలో గాయపడిన బాలిక ఆరోగ్యంపై మంత్రి లోకేశ్ కీలక అప్‌డేట్

మొదటి పేజీ తరువాయి)

బెంగళూరులోని మణిపాల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాలిక ఆరోగ్య పరిస్థితిలో పురోగతి కనిపిస్తోందని వైద్యుల బృందం వెల్లడించినట్లు ఆయన ఎక్స్‌లో పేర్కొన్నారు. బాలిక స్పృహలో ఉందని, తల్లి ఆమెను పరామర్శించిందని తెలిపారు. వైద్యుల సూచనలను అర్థం చేసుకుని స్పందిస్తోందని వివరించారు. పరిస్థితి ఇలాగే మెరుగుపడితే గురువారం సాయంత్రం వెంటిలేటర్ సపోర్ట్ తొలగించే అవకాశం ఉందని వైద్యులు భావిస్తున్నట్లు చెప్పారు. బాలిక త్వరగా పూర్తిగా కోలుకోవాలని ఆకాంక్షించారు.ఇదే ఘటనలో గాయపడిన మరో బాలిక లక్ష్మి ధైర్యసాహసాలను లోకేశ్ ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఓ వ్యక్తి రంపంతో పాఠశాలలోకి ప్రవేశించి దాడికి పాల్పడిన సమయంలో లక్ష్మి భయపడి పారిపోకుండా తన స్నేహితురాలిని కాపాడేందుకు ముందుకు వెళ్లిందని తెలిపారు. ఆమెను రక్షించే ప్రయత్నంలో తాను కూడా తీవ్రంగా గాయపడిందని పేర్కొన్నారు. తనను తాను కాపాడుకునే అవకాశం ఉన్నా.. స్నేహితురాలికి అండగా నిలిచిందని ప్రశంసించారు. ప్రస్తుతం ఇద్దరు బాలికలూ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని లోకేశ్ తెలిపారు. లక్ష్మికి కూడా మెరుగైన వైద్యం అందిస్తున్నామని, రెండు కుటుంబాలకూ ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. రాష్ట్రంలోని ఏ పాఠశాల తరగతి గదిలోనూ చిన్నారులు అభద్రతకు గురికాకుండా అవసరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

ఓబీసీ గణనపై తీర్మానం చేయండి: సీఎం రేవంత్‌కు కవిత బహిరంగ లేఖ

మొదటి పేజీ తరువాయి)

నిర్వహించాలని తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆమె ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఒక బహిరంగ లేఖ రాశారు. ఓబీసీ కులగణనతో పాటు, ఆదివాసీల మతాన్ని నమోదు చేసేందుకు కూడా ప్రత్యేక కాలమ్ ఏర్పాటు చేయాలని కోరుతూ తీర్మానాలు చేయాలని ఆమె విజ్ఞప్తి చేశారు.దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు గడిచినా, బీసీలకు వారి జనాభా దామాషా ప్రకారం ప్రయోజనాలు అందడం లేదని కవిత తన లేఖలో పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా ఓబీసీల జనాభాపై చట్టబద్ధమైన, అధికారిక గణాంకాలు లేకపోవడం వల్లే ఈ పరిస్థితి నెలకొందని ఆమె అభిప్రాయపడ్డారు. కులాల వారీగా లెక్కలు తేలితేనే వారికి సంక్షేమ ఫలాలు సరిగ్గా అందుతాయని స్పష్టం చేశారు. అదేవిధంగా, ఆదివాసీల ప్రత్యేక జీవనశైలి, సంస్కృతి, ప్రకృతి ఆరాధనను దృష్టిలో ఉంచుకుని జనగణనలో వారి మతాన్ని నమోదు చేయడానికి ప్రత్యేక కాలమ్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. డిసెంబర్ నుంచి ఇంటింటి జనగణన కార్యక్రమం ప్రారంభం కానున్న నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం తక్షణమే స్పందించి ఈ తీర్మానాలను ఆమోదించాలని కవిత కోరారు.

ఏపీ తీరం వైపు 'మురసు'.. పోర్టుల్లో పెను ప్రమాద హెచ్చరికలు.. దక్షిణ కోస్తాలో రెడ్ అలర్ట్

మొదటి పేజీ తరువాయి)

(నవంబర్ 2) అర్ధరాత్రి నుంచి మంగళవారం (నవంబర్ 3) తెల్లవారుజాము మధ్యలో నెల్లూరు–నరసాపురం మధ్య ఒంగోలు సమీపంలో ఈ తీవ్ర తుపాను తీరం దాటే అవకాశం ఉంది. ముఖ్యంగా, ఒంగోలుకు దక్షిణం వైపున ఇది తీరం దాటుతుందని వాతావరణ నివేదికలు చెబుతున్నాయి. తీరం దాటే సమయంలో గంటకు 100 నుంచి 110 కిలోమీటర్ల వేగంతో ప్రచండ గాలులు వీస్తాయని, గరిష్ఠంగా గంటకు 120 కిలోమీటర్ల వేగాన్ని కూడా అందుకోవచ్చని అధికారులు హెచ్చరిస్తున్నారు.తుపాను నేపథ్యంలో ప్రభుత్వం ముందుజాగ్రత్త చర్యలు చేపట్టింది. బాపట్ల జిల్లాలో మంగళవారం (నవంబర్ 3) పాఠశాలలు, కళాశాలలకు కలెక్టర్ సెలవు ప్రకటించారు. సూర్యలంక బీచ్‌ను మూసివేసి, పర్యాటకులు, స్థానికులు ఎవరూ అటువైపు వెళ్లవద్దని హెచ్చరికలు జారీ చేశారు. ఇదే తరహాలో ఎన్టీఆర్, పల్నాడు, నెల్లూరు జిల్లాల్లోనూ విద్యాసంస్థలకు సెలవులు ఇచ్చారు. సహాయక చర్యల కోసం బాపట్లలో 9281413774, గుంటూరులో 9440827526 నంబర్లతో కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేశారు.తుపాను ప్రభావంతో పలు రైళ్లు, విమాన సర్వీసులు రద్దయ్యాయి. ముఖ్యంగా విజయవాడ–గూడూరు, తెనాలి–రేపల్లె మార్గాల్లో పలు రైళ్లను రద్దు చేస్తున్నట్లు రైల్వే శాఖ ప్రకటించింది. విజయవాడ, భోగాపురం విమానాశ్రయాల నుంచి రాకపోకలు సాగించాల్సిన అనేక విమాన సర్వీసులను కూడా నిలిపివేశారు. కోస్తాంధ్ర, ఉత్తర తమిళనాడు ప్రాంతాలకు రెడ్ అలర్ట్ జారీ చేసిన అధికారులు, లోతట్టు ప్రాంతాలు 1 నుంచి 1.5 మీటర్ల మేర ముంపునకు గురయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అనవసర ప్రయాణాలు మానుకోవాలని సూచించారు.

చెత్తరహిత, ట్రాఫిక్ ఫ్రీ హైదరాబాద్ లక్ష్యం: సీఎం

మొదటి పేజీ తరువాయి)

నిర్మాణ వ్యర్థాల నిర్వహణకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. నిర్మాణ వ్యర్థాలను తరలించే సమయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పటిష్ఠమైన వ్యవస్థను ఏర్పాటు చేయాలని సూచించారు. చెత్త సేకరణ, వ్యర్థాల తరలింపు ప్రక్రియలో ఎక్కడా అంతరాయం లేకుండా చూడాలని స్పష్టం చేశారు.

శుద్ధి చేసిన నీటినే వినియోగించాలి

గ్రీన్ ట్యాంకర్ల ద్వారా శుద్ధి చేసిన నీటి సరఫరాను విస్తరించాలని సీఎం సూచించారు. నిర్మాణ పనులు, పార్కులు, పచ్చదనం నిర్వహణ వంటి అవసరాలకు శుద్ధి చేసిన నీటినే వినియోగించాలని ఆదేశించారు. జీహెచ్ఎంసీతోపాటు సీఎంసీ, ఎంఎంసీ పరిధుల్లోనూ గ్రీన్ వాటర్ సరఫరాను పెంచాలని స్పష్టం చేశారు.

ట్రాఫిక్ కష్టాలకు పరిష్కారం చూపాలి

నగరంలో ట్రాఫిక్ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని అధికారులను ఆదేశించారు. సిగ్నళ్ల వద్ద వాహనాలు ఎక్కువసేపు నిలిచిపోవడంతో నగరవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఈ సమస్యను అధిగమించేందుకు సిగ్నల్ ఫ్రీ ట్రాఫిక్ వ్యవస్థపై దృష్టి సారించాలని సూచించారు.

అండర్‌పాస్‌లు, ఎలివేటెడ్ కారిడార్లకు ప్రణాళికలు

ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు అవసరమైన ప్రాంతాల్లో అండర్‌పాస్‌లు, ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేయాలని సీఎం ఆదేశించారు. నగరంలో వాహనాల రాకపోకలు సజావుగా సాగేందుకు సమగ్ర ప్రణాళికతో ముందుకు వెళ్లాలని అధికారులకు సూచించారు.

లక్ష మంది విద్యార్థులకు ఉచిత ఏఐ, క్లౌడ్ శిక్షణ

మొదటి పేజీ తరువాయి)

విద్యార్థులపై ఎలాంటి ఆర్థిక భారం ఉండదని స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా టాస్క్ అనుబంధంగా ఉన్న 643 కళాశాలల్లో శిక్షణ అందించనున్నట్లు పేర్కొన్నారు.

వివిధ రంగాల్లో సాంకేతిక నైపుణ్యాలు

ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు ఏఐ, డేటా ఇంజినీరింగ్, మెషిన్ లెర్నింగ్, జనరేటివ్ ఏఐ వంటి ఆధునిక సాంకేతిక అంశాల్లో శిక్షణ ఇవ్వనున్నారు. ఇంజినీరింగ్ విద్యార్థులకే కాకుండా ఆర్ట్స్, కామర్స్ విభాగాల విద్యార్థులకు కూడా ప్రత్యేక కోర్సులు అందుబాటులో ఉంటాయని మంత్రి తెలిపారు. ఏడాది పాటు 900కు పైగా డిజిటల్ కోర్సులను ఉచితంగా అభ్యసించే అవకాశం కల్పించనున్నట్లు వివరించారు.

గ్లోబల్ సర్టిఫికేషన్లకు రాయితీ వోచర్లు

అంతర్జాతీయ స్థాయి సాంకేతిక ధ్రువీకరణ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు డిస్కౌంట్ వోచర్లు అందించనున్నట్లు శ్రీధర్‌బాబు తెలిపారు. విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంపొందించేందుకు హ్యాకథాన్లు, పరిశ్రమల ప్రతినిధులతో అనుసంధాన కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. తద్వారా పరిశ్రమల అవసరాలు, ఉద్యోగ అవకాశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించనున్నట్లు పేర్కొన్నారు.

శిక్షణ తర్వాత ప్రత్యేక జాబ్ మేళాలు

శిక్షణ పూర్తి చేసుకున్న అర్హులైన విద్యార్థులకు ప్రత్యేక జాబ్ మేళాలు నిర్వహించనున్నట్లు మంత్రి వెల్లడించారు. ఉద్యోగ అవకాశాలకు అవసరమైన నైపుణ్యాలను పెంపొందించడంపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు తెలిపారు. విద్యార్థులతోపాటు కళాశాల అధ్యాపకులకూ ప్రపంచస్థాయి ఏఐ, క్లౌడ్ కంప్యూటింగ్ శిక్షణ అందించనున్నట్లు చెప్పారు.

అంతర్జాతీయ నైపుణ్యాలే లక్ష్యం

రాష్ట్ర యువతకు అంతర్జాతీయ స్థాయిలో పోటీపడగల సాంకేతిక నైపుణ్యాలను అందించడమే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశమని శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. ఆధునిక సాంకేతిక రంగాల్లో వస్తున్న మార్పులకు అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దడం ద్వారా వారి ఉపాధి అవకాశాలను మెరుగుపరచాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని తెలిపారు.

హైదరాబాద్ మెట్రోకు నిధుల జోరు.. ఫేజ్-2కు రూ.150 కోట్లు

మొదటి పేజీ తరువాయి)

హైదరాబాద్ మెట్రో రైల్ ప్రాజెక్టుకు సంబంధించి నిధులు మంజూరు చేస్తూ పరిపాలనా ఉత్తర్వులు జారీ చేసింది. రెండో దశ (ఫేజ్-2) పనుల కోసం రూ.150 కోట్లు, ప్రభుత్వ రుణాల పద్దు కింద మరో రూ.125 కోట్లు కేటాయించింది.నగరంలో పెరుగుతున్న జనాభా, ఐటీ, పారిశ్రామిక రంగాల విస్తరణకు అనుగుణంగా మెట్రో నెట్‌వర్క్‌ను శివారు ప్రాంతాలకు విస్తరించాలన్నది ప్రభుత్వ లక్ష్యం. తాజా నిధులతో ఫేజ్-2కు సంబంధించిన సాధ్యాసాధ్యాల అధ్యయనాలు, ప్రాథమిక పనులు, ప్రతిపాదిత కారిడార్ల సర్వేలు వేగవంతం కానున్నాయి.రెండో దశలో శంషాబాద్ విమానాశ్రయం, ఐటీ హబ్ పరిధిలోని రాయదుర్గం-కోకాపేట, పాతబస్తీ పరిధిలోని ఎంజీబీఎస్-చంద్రాయణగుట్టతో పాటు ఇతర శివారు ప్రాంతాలను కలిపే కారిడార్లను ప్రతిపాదించారు. మరోవైపు ప్రభుత్వ రుణాల పద్దు కింద కేటాయించిన రూ.125 కోట్లతో మెట్రో ప్రాజెక్టు నిర్వహణ, ఆర్థిక బకాయిలకు సంబంధించిన అవసరాలను సమతుల్యం చేయాలని భావిస్తున్నారు. ఈ నిధుల కేటాయింపుతో ఫేజ్-2 పనులకు సంబంధించిన తదుపరి చర్యలు ముందుకు సాగనున్నాయి.

హైదరాబాద్ శివార్లలో అక్రమ బోర్లను టార్గెట్ చేసిన హైడ్రా

అక్రమ బోర్లపై హైడ్రా ప్రత్యేక దృష్టి

సంగారెడ్డి జిల్లా తెల్లాపూర్‌లో 7 బోర్లు, 6 వాటర్ సంపుల ధ్వంసం

అనుమతులు లేని భూగర్భ జలాల వాణిజ్య వినియోగంపై ఉక్కుపాదం

ట్యాంకర్ల వేగానికి చెక్ పడటంతో హర్షం వ్యక్తం చేస్తున్న స్థానికులు



హైదరాబాద్, దాని శివారు ప్రాంతాల్లో అక్రమంగా భూగర్భ జలాలను తోడేస్తూ సాగిస్తున్న నీటి వ్యాపారంపై హైడ్రా (HYDRAA) ఉక్కుపాదం మోపుతోంది. ఎలాంటి అనుమతులు లేకుండా బోర్లు వేసి, నీటిని ట్యాంకర్ల ద్వారా అమ్ముకుంటున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా, సంగారెడ్డి జిల్లా తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో సోమవారం భారీ ఆపరేషన్ చేపట్టింది.ఈ ఆపరేషన్‌లో భాగంగా తెల్లాపూర్‌లోని రెండు వేర్వేరు ప్రాంతాల్లో 7 అక్రమ బోర్‌వెల్‌లను పైపులతో సహా తొలగించి, వాటిని పూర్తిగా పూడ్చివేసింది. అలాగే, నీటి నిల్వ కోసం నిర్మించిన 6 భారీ వాటర్ సంపులను కూడా అధికారులు ధ్వంసం చేశారు. నీటి రవాణాకు ఉపయోగిస్తున్న ట్యాంకర్లను సీజ్ చేసి, సంబంధిత యజమానులపై కేసులు నమోదు చేశారు.భూగర్భ జలాలు అడుగంటిపోకుండా కాపాడటంతో పాటు, స్థానిక ప్రజలకు నీటి కొరత ఏర్పడకుండా చూసేందుకే ఈ చర్యలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. గత కొంతకాలంగా నీటి ట్యాంకర్లు అతివేగంగా, నిర్లక్ష్యంగా ప్రయాణిస్తూ ప్రమాదాలకు కారణమవుతున్నాయని, తమ ప్రాణాలకు భద్రత లేకుండా పోయిందని పలు కాలనీలు, గేటెడ్ కమ్యూనిటీల వాసులు ఆందోళన వ్యక్తం చేసిన నేపథ్యంలో హైడ్రా ఈ చర్యలకు ఉపక్రమించింది. హైడ్రా తీసుకుంటున్న చర్యలతో తమకు ప్రాణభయం తప్పిందని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా చెరువులు, కుంటల సమీపంలో జరుగుతున్న అక్రమ నీటి దందాను పూర్తిగా అరికట్టాలని వారు కోరుతున్నారు. అనుమతులు లేని బోర్లపై నిఘా కొనసాగిస్తామని, అక్రమ కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని అధికారులు హెచ్చరిస్తున్నారు.

అమిత్ షాతో భేటీపై సోషల్ మీడియాలో స్పందించిన చిరంజీవి, రామ్ చరణ్

సోమవారం నాడు హైదరాబాదులో పర్యటించిన కేంద్ర హోంమంత్రి అమిత్ షాను మెగాస్టార్ చిరంజీవి, మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ కలిశారు. ఇటీవల సినీ పరిశ్రమను తీవ్రంగా ఆందోళనకు గురిచేస్తున్న ఏఐ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్), డీప్‌ఫేక్ టెక్నాలజీల దుర్వినియోగంపై వారు హోంమంత్రికి తమ ఆవేదనను తెలియజేశారు. ఈ సమస్యపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. వారి ఆందోళనను సావధానంగా విన్న అమిత్ షా, ఈ అంశాన్ని తక్షణమే పరిశీలించి కఠినమైన నిబంధనలు తీసుకొస్తామని హామీ ఇచ్చారు. ఈ భేటీపై చిరంజీవి, రామ్ చరణ్ సోషల్ మీడియా వేదికగా స్పందించారు."గౌరవనీయ హోంమంత్రి అమిత్ షా గారిని కలవడం సంతోషంగా ఉంది. ఏఐ, డీప్‌ఫేక్ టెక్నాలజీల దుర్వినియోగం వల్ల కళాకారుల హక్కులు, గౌరవానికి తీవ్ర ముప్పు వాటిల్లుతోందన్న నా ఆందోళనను ఆయనతో పంచుకున్నాను. ఆయన మా సమస్యను అర్థం చేసుకుని, ఈ అంశాన్ని ప్రభుత్వం వెంటనే పరిశీలిస్తుందని, కఠినమైన నిబంధనలు, శిక్షలు తీసుకొస్తామని హామీ ఇచ్చారు. రాతపూర్వకంగా వినతిపత్రం ఇవ్వాలని సూచించారు. ఈ వ్యవహారాన్ని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి గారు సమన్వయం చేస్తారని తెలిపారు. ఆయన హామీకి కృతజ్ఞతలు" అంటే చిరంజీవి ట్వీట్ చేశారు.రామ్ చరణ్ స్పందిస్తూ.. "ఈ రోజు నాన్నగారితో కలిసి హోంమంత్రి అమిత్ షా గారిని కలవడం గౌరవంగా భావిస్తున్నాను. డీప్‌ఫేక్ వల్ల కళాకారులపై, పరిశ్రమపై పడుతున్న తీవ్ర ప్రభావం గురించి మేం వివరించగా, ఆయన సానుకూలంగా స్పందించడం ప్రోత్సాహకరంగా ఉంది. ఈ అంశాన్ని ప్రభుత్వం వెంటనే పరిశీలించి కఠిన చర్యలు తీసుకుంటుందని ఆయన ఇచ్చిన హామీ మాకు ఎంతో ధైర్యాన్నిచ్చింది. మా ఆందోళనను అర్థం చేసుకుని, మద్దతు తెలిపినందుకు ఆయనకు కృతజ్ఞతలు" అని తెలిపారు.



అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలి

కలెక్టరేట్ ఎదుట ఏఐటీయూసీ ఆధ్వర్యంలో భారీ ధర్నా

కాంగ్రెస్ మ్యానిఫెస్టో హామీ మేరకు రూ.18 వేల వేతనం చెల్లించాలి

ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి రూ.10 వేల పెన్షన్ కల్పించాలి

పల్లా దేవేందర్ రెడ్డి, ఏఐటీయూసీ రాష్ట్ర డిప్యూటీ ప్రధాన కార్యదర్శి



నల్లగొండ జిల్లా నవంబర్ 2 (నేటి వెలుగు):

తెలంగాణ రాష్ట్రంలో ఐసీడీఎస్ పరిధిలో పనిచేస్తున్న అంగన్వాడీ టీచర్లు, హెల్పర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఏఐటీయూసీ రాష్ట్ర డిప్యూటీ ప్రధాన కార్యదర్శి, అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ గౌరవాధ్యక్షులు పల్లా దేవేందర్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఏఐటీయూసీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు నల్లగొండ జిల్లా కలెక్టరేట్ ఎదుట అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో భారీ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పల్లా దేవేందర్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు అంగన్వాడీ సిబ్బందికి నెలకు రూ.18 వేల వేతనం చెల్లించాలని కోరారు. పదవీ విరమణ అనంతరం నెలకు రూ.10 వేల పెన్షన్ అందించాలని, టీచర్లు, హెల్పర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు.చిన్నారులకు పౌష్టికాహారం అందించడం, గర్భిణులు, బాలింతలకు సేవలందించడం, ప్రీ-స్కూల్ విద్య, ఆరోగ్య కార్యక్రమాల అమలులో అంగన్వాడీ సిబ్బంది కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. ఇంతటి బాధ్యతలు నిర్వహిస్తున్నప్పటికీ తక్కువ వేతనాలు, పెండింగ్ బిల్లులు, అదనపు పని భారంతో వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.అంగన్వాడీ టీచర్లను బూత్ లెవల్ ఆఫీసర్ () విధుల నుంచి మినహాయించాలని, సిబ్బందికి పీఎఫ్, ఈఎస్ఐ, హెల్త్ కార్డులు, రూ.25 లక్షల ప్రమాద బీమా కల్పించాలని కోరారు. 2023 సమ్మె కాలానికి సంబంధించిన కేసులను ఎత్తివేసి, ఆ కాలపు వేతనాలను చెల్లించాలని, అర్హత, సర్వీసు ఆధారంగా గ్రేడ్-2 సూపర్వైజర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేయాలని కోరారు. అంగన్వాడీ వ్యవస్థకు నష్టం కలగకుండా ప్రీ-ప్రైమరీ విద్యా విధానంపై నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. లిఎడమ సుమతి మాట్లాడుతూలి అంగన్వాడీ కేంద్రాలకు సరఫరా చేసే గ్యాస్ సిలిండర్ల ఈ-కేవైసీ పేరుతో సిబ్బందిని ఇబ్బందులకు గురిచేయడం సరికాదన్నారు. ప్రభుత్వమే గ్యాస్ సిలిండర్లకు ఈ-కేవైసీ ప్రక్రియను పూర్తి చేయాలని కోరారు. కనీస వేతనం రూ.26 వేలకు పెంచాలని, బీఎల్ఓ విధులను రద్దు చేయాలని, పీఎఫ్, ఈఎస్ఐ, రూ.25 లక్షల ప్రమాద బీమా సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. అధికారంలోకి వచ్చి రెండేళ్లు దాటినా ఎన్నికల హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కేఎస్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు బరిగల వెంకటేష్, సహాయ కార్యదర్శి ఎం.డి. జానీ, ప్రజానాట్యమండలి జిల్లా ప్రధాన కార్యదర్శి చలం పాండురంగారావు, అంగన్వాడీ సంఘం రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు సుజిత, కోట్ల శోభ, జిల్లా నాయకులు జ్యోతి, డి. కవిత, ఏ. సరిత, కే. వజ్రమ్మ తదితరులు పాల్గొన్నారు. పెద్ద సంఖ్యలో అంగన్వాడీ టీచర్లు, హెల్పర్లు ధర్నాలో పాల్గొన్నారు.

రక్త దానం మరొక ప్రాణాన్ని కాపాడుతుంది.డీఎస్పీ శివరాం రెడ్డి





నల్గొండ జిల్లా నవంబర్ 2 (నేటి వెలుగు)

కట్టంగూరు మండల కేంద్రంలో జరుగుతున్న తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ జిల్లా మహాసభలలో ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరాన్ని ప్రారంభించిన డిఎస్పి శివరాం రెడ్డి గారు మాట్లాడుతూ ఉపాధ్యాయ సంఘం అంటే ఎప్పుడు వాళ్ళ సమస్యలు పరిష్కారానికి పోరాటం చేస్తుందని అనుకున్నానని కానీ తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ సంఘం ఉపాధ్యాయుల హక్కుల సాధన కోసమే కాకుండా తమ బాధ్యతగా సామాజిక స్పృహతో రక్తదానం చేయడం ఎంతో అభినందనీయమని మీరు చేసే ఈ రక్తదానం ఆపదలో ఉన్న ఎంతోమంది ప్రాణాలను కాపాడుతుందని అన్నారు. ఉపాధ్యాయులు అంటే పిల్లలకు పాఠాలు చెప్పడమే కాదు సమాజానికి తమ వంతు సహకారం కూడా అందించాలి. అందుకు తగ్గట్టుగానే టీఎస్ యుటిఎఫ్ కృషి చేస్తున్నందుకు రక్త దాన శిబిరాన్ని ప్రారంభించడం నాకు సంతోషంగా ఉందని అన్నారు. సందర్భంగా ఉపాధ్యాయులు 60 మంది పైగా రక్తదానం చేయడం ద్వారా మరో 60 మంది ప్రాణాలు కాపాడినట్లేనని అన్నారు. హక్కులకోసంమే కాదు బాధ్యతలకై నిలబడటం అభినందనీయం. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏ వెంకట్, ఉపాధ్యక్షులు ఎం. రాజశేఖర్ రెడ్డి, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బక్కా శ్రీనివాస చారి పెరుమాళ్ళ వెంకటేశం, ఉపాధ్యక్షులు నర్రా శేఖర్ రెడ్డి, బి అరుణ, వడిత్య రాజు, గేర నరసింహ శ్రీనివాస్ రెడ్డి జాల అరుణ మధుసూదన్ రెడ్డి, రాచమల్ల రమాదేవి, మిట్టపల్లి మురళయ్య, నలపరాజు వెంకన్న, ఏ చిన్న వెంకన్న పగిళ్ల సైదులు కొమరాజు సైదులు మండలాల బాధ్యులు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణికి 116 ఫిర్యాదులు





- **ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వద్దు: అదనపు కలెక్టర్ కిరణ్మయి**
- **పెండింగ్ అర్జీలను వెంటనే పరిష్కరించాలని అధికారులకు ఆదేశం**

రంగారెడ్డి జిల్లా నవంబర్ 2 (నేటి వెలుగు):

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (ఐడీఓసీ) సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 116 ఫిర్యాదులు అందాయి. జిల్లా అదనపు కలెక్టర్లు (లోకల్ బాడీస్) కిరణ్మయి, చంద్రారెడ్డి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి వినతిపత్రాలు సమర్పించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ కిరణ్మయి మాట్లాడుతూ ప్రజావాణిలో అందిన ప్రతి అర్జీని సంబంధిత శాఖల అధికారులు ప్రాధాన్యతతో పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. ఫిర్యాదులను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.ప్రజలకు మెరుగైన ప్రభుత్వ సేవలు అందించడంలో అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, సమస్యల పరిష్కారంలో జాప్యం జరగకుండా ప్రత్యేక శ్రద్ధ చూపాలని స్పష్టం చేశారు.సోమవారం అందిన మొత్తం 116 ఫిర్యాదుల్లో రెవెన్యూ శాఖకు సంబంధించి 67 అర్జీలు, ఇతర శాఖలకు సంబంధించి 49 అర్జీలు ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. స్వీకరించిన అర్జీలను సంబంధిత శాఖలకు పంపించి పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి శారదాదేవి, వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ప్రజావాణి అర్జీలను వెంటనే పరిష్కరించాలి

అధికారులకు అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి ఆదేశం

మేడ్చల్--మల్కాజిగిరి జిల్లాలో ప్రజావాణికి 147 ఫిర్యాదులు




మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా నవంబర్ 2 (నేటి వెలుగు)

ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి స్వీకరించిన అర్జీలను ఏమాత్రం ఆలస్యం చేయకుండా నిబంధనల ప్రకారం వెంటనే పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి అధికారులను ఆదేశించారు.సోమవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. ఈ సందర్భంగా రెవెన్యూ, హౌసింగ్, పంచాయతీరాజ్, పౌరసరఫరాలు, మున్సిపల్ తదితర శాఖలకు సంబంధించి మొత్తం 147 దరఖాస్తులు అందినట్లు వెల్లడించారు.జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి తమ సమస్యల పరిష్కారం కోసం వచ్చిన బాధితుల అర్జీలను అధికారులు ప్రాధాన్యతతో పరిశీలించాలని సూచించారు. ప్రతి ఫిర్యాదుపై తక్షణ చర్యలు తీసుకుని బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చూడాలని స్పష్టం చేశారు.స్వీకరించిన దరఖాస్తులపై చేపట్టిన చర్యలు, పరిష్కార వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ప్రజావాణి ఫిర్యాదుల పరిష్కారంలో నిర్లక్ష్యం, జాప్యం ఉండకూడదని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి మాలతి, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఒకే రోజు రెండు పరీక్షలా?

- **ఎస్ఐ ప్రిలిమ్స్ పరీక్ష వాయిదా వేయాలి**
- **హోంశాఖ ముఖ్య కార్యదర్శి శిఖా గోయల్‌కు బీసీ జేఏసీ వినతి**

హైదరాబాద్, నవంబర్ 2 (నేటి వెలుగు):



నవంబర్ 29న నిర్వహించనున్న సబ్ ఇన్‌స్పెక్టర్ (ఎస్ఐ) ప్రిలిమినరీ పరీక్షలను వాయిదా వేసి మరో తేదీని ప్రకటించాలని బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగం గౌడ్ ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు సోమవారం సచివాలయంలో హోంశాఖ ముఖ్య కార్యదర్శి శిఖా గోయల్ కార్యాలయంలో ఆయన వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జాజుల లింగం గౌడ్ మాట్లాడుతూ.. నవంబర్ 29న బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించే ఆల్ ఇండియా బార్ ఎగ్జామినేషన్ (ఏఐబిఇ)తో పాటు అదే రోజు ఎస్ఐ ప్రిలిమ్స్ పరీక్ష నిర్వహించేందుకు నిర్ణయించడం నిరుద్యోగ అభ్యర్థులకు ఇబ్బందికరంగా మారుతుందని పేర్కొన్నారు.ఈ రెండు పరీక్షలకు అర్హత కలిగిన అనేకమంది అభ్యర్థులు ఇప్పటికే దరఖాస్తు చేసుకున్నారని, ఒకే రోజు రెండు కీలక పరీక్షలు నిర్వహిస్తే ఏదో ఒక పరీక్షకు దూరమయ్యే పరిస్థితి ఏర్పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. దీనివల్ల అభ్యర్థులు విలువైన అవకాశాన్ని కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. నిరుద్యోగ యువత భవిష్యత్తును, అభ్యర్థుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం తక్షణమే స్పందించాలని కోరారు. నవంబర్ 29న నిర్వహించనున్న ఎస్ఐ ప్రిలిమ్స్ పరీక్షను వాయిదా వేసి, మరో తేదీని ప్రకటించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

ప్రజా ఫిర్యాదులపై సత్వర స్పందన.. బాధితులకు చట్ట పరంగా న్యాయం చేయాలని అధికారులకు ఎస్పీ ఆదేశం

నల్గొండ జిల్లా నవంబర్ 2 (నేటి వెలుగు)



సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన పోలీస్ గ్రీవెన్స్ డే కార్యక్రమంలో జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్, ఐపీఎస్ జిల్లాలో వివిధ పోలీస్ స్టేషన్ పరిధిలో నుంచి వచ్చిన దాదాపు 34 మంది బాధితులసమస్యలను, ఫిర్యాదులను సవివరంగా విని సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా బాధితులు భూ వివాదాలు, కుటుంబ సమస్యలు, ఆర్థిక లావాదేవీలు, మోసాలు, ఆస్తి సంబంధిత వివాదాలు తదితర అంశాలపై తమ ఫిర్యాదులను ఎస్పీ దృష్టికి తీసుకువచ్చారు. ప్రతి ఫిర్యాదును పరిశీలించిన ఎస్పీ గారు, సంబంధిత పోలీస్ అధికారులు మరియు సిబ్బందితో మాట్లాడి సమస్యల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై ఆదేశాలు జారీ చేశారు.బాధితుల ఫిర్యాదులపై క్షేత్రస్థాయిలో సమగ్రంగా విచారణ చేపట్టి, వాస్తవాలను నిర్ధారించిన అనంతరం చట్టపరమైన నిబంధనల ప్రకారం సత్వర చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యం చేయకుండా, ప్రతి కేసు పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు.ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం పోలీస్ శాఖపై నమ్మకంతో వస్తున్నందున, వారి ఫిర్యాదులను గౌరవంగా స్వీకరించి, నిష్పక్షపాతంగా విచారణ జరిపి బాధితులకు న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని ఎస్పీ గారు అధికారులకు సూచించారు. ప్రజలకు అందుబాటులో ఉండి, వారి సమస్యలను పరిష్కరించడం పోలీస్ శాఖ ప్రధాన బాధ్యత అని తెలిపారు.గ్రీవెన్స్ డే ద్వారా ప్రజలు నేరుగా జిల్లా ఎస్పీని కలిసి తమ సమస్యలను వివరించే అవకాశం కల్పిస్తున్నామని, ప్రతి ఫిర్యాదును ప్రాధాన్యతతో పరిశీలించి చట్ట పరిధిలో సత్వర పరిష్కారం అందించేందుకు చర్యలు తీసుకుంటామని ఎస్పీ శరత్ చంద్ర పవార్, ఐపీఎస్ తెలిపారు.

అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి!

- **టిమ్స్, ఉస్మానియా, నిమ్స్, హైకోర్టు నిర్మాణాలపై మంత్రి కోమటిరెడ్డి సమీక్ష**
- **ఈ ఏడాదిలోనే ఆల్వాల్ టిమ్స్, వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులు అందుబాటులోకి తేవాలి**
- **85వ ఇండియన్ రోడ్స్ కాంగ్రెస్ సదస్సును ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలి**



హైదరాబాద్ నవంబర్ 2 (నేటి వెలుగు):

రాష్ట్రంలో చేపడుతున్న రహదారులు, ఆస్పత్రులు, కీలక మౌలిక వసతుల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అధికారులను ఆదేశించారు.డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో ఆర్ అండ్ బీ శాఖ ఉన్నతాధికారులతో మంత్రి సుదీర్ఘ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న రహదారుల నిర్మాణ పనులు, హామ్ రోడ్ల పురోగతి, టిమ్స్ ఆస్పత్రులు, ఉస్మానియా జనరల్ ఆస్పత్రి, నిమ్స్ విస్తరణ, నూతన హైకోర్టు భవన నిర్మాణాలపై సమగ్రంగా సమీక్షించారు.ఆల్వాల్ టిమ్స్, వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల నిర్మాణ పనులను మరింత వేగవంతం చేసి ఈ ఏడాదిలోనే ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు నిర్మాణ పనుల్లో నాణ్యత, వేగం విషయంలో రాజీ పడకూడదని సూచించారు.

85వ ఇండియన్ రోడ్స్ కాంగ్రెస్‌పై ప్రత్యేక దృష్టి

ఈ నెల 19 నుంచి 22 వరకు హైదరాబాద్‌లోని హైటెక్స్‌లో నిర్వహించనున్న 85వ ఇండియన్ రోడ్స్ కాంగ్రెస్ సదస్సు ఏర్పాట్లపై మంత్రి ప్రత్యేకంగా సమీక్షించారు. కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభం కానున్న ఈ ప్రతిష్టాత్మక సదస్సును తెలంగాణ అభివృద్ధి, సంస్కృతి, మౌలిక వసతులు, పెట్టుబడుల అవకాశాలను దేశ, అంతర్జాతీయ స్థాయిలో చాటిచెప్పే వేదికగా తీర్చిదిద్దాలని సూచించారు.సదస్సులో ప్రత్యేక తెలంగాణ పెవిలియన్ ఏర్పాటు చేయాలని, దేశంలోని ప్రధాన నగరాల్లో విస్తృత ప్రచారం నిర్వహించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. డిసెంబర్‌లో నిర్వహించనున్న 'ఇన్వెస్ట్ తెలంగాణ' గ్లోబల్ సమ్మిట్‌కు ఈ సదస్సును ప్రీ-సమ్మిట్ వేదికగా వినియోగించుకోవాలని పేర్కొన్నారు. 85వ ఇండియన్ రోడ్స్ కాంగ్రెస్ వేదికగా రాష్ట్ర రహదారి నెట్‌వర్క్, రైల్వే ప్రాజెక్టులకు సంబంధించి కీలక ప్రకటనలు వెలువడనున్న నేపథ్యంలో సదస్సును అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని మంత్రి అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమం ద్వారా తెలంగాణకు పెట్టుబడులు ఆకర్షించడంతో పాటు రాష్ట్ర అభివృద్ధికి కొత్త అవకాశాలు సృష్టించాలని స్పష్టం చేశారు.



నేటి వెలుగు
నేటి సమాజం... నేటి వెలుగు...
తెలుగు దినపత్రిక
పి. నవీన్ కుమార్ గౌడ్

ఆర్ అండ్ బీ శాఖ కార్యదర్శిగా ఇలంబర్తి బాధ్యతల స్వీకరణ

- మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన నూతన కార్యదర్శి


హైదరాబాద్ నవంబర్ 2 (నేటి వెలుగు):



రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ కార్యదర్శిగా శ్రీ ఇలంబర్తి, ఐఏఎస్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర సచివాలయంలో రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఇలంబర్తికి మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. శాఖ పరిధిలోని అభివృద్ధి కార్యక్రమాలు, రహదారులు, భవన నిర్మాణ పనులను సమర్థవంతంగా ముందుకు తీసుకెళ్లాలని ఆకాంక్షించారు.

ఎయిడ్స్ నియంత్రణలో సూర్యాపేట జిల్లాకు 'సురక్షిత్' హోదా

- జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా వైద్య ఆరోగ్య శాఖ అధికారులకు సత్కారం
- తదుపరి లక్ష్యం 'సురక్షిత్ ప్లస్' సాధన: కలెక్టర్ తేజస్ నందాల్ పవార్





సూర్యాపేట, నవంబర్ 2,(నేటి వెలుగు)

హెచ్ఐవి / ఎయిడ్స్ నియంత్రణలో భాగంగా చేపట్టిన మిషన్ ఎయిడ్స్ సురక్ష సురక్షిత్ --మాస్) కార్యక్రమంలో సూర్యాపేట జిల్లా 'సురక్షిత్ ' హోదా సాధించింది. ఈ సందర్భంగా సోమవారం జిల్లా కలెక్టర్ తేజస్ నందాల్ పవార్, ఐఏఎస్ ఆధ్వర్యంలో అభినందన కార్యక్రమం నిర్వహించారు.జిల్లాలో హెచ్ఐవి / ఎయిడ్స్ నివారణ, నియంత్రణ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేస్తూ సురక్షిత్ హోదా సాధించడంలో కీలక పాత్ర పోషించిన వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, కార్యక్రమ నిర్వాహకులను కలెక్టర్ ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వెంకట్ రమణ, ప్రోగ్రామ్ ఆఫీసర్ (ఏ ఆ ఎల్) డాక్టర్ యనగందుల నాగరాజు, జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ వి. సుధాకర్, మిషన్ ఎయిడ్స్ సురక్ష కార్యక్రమ ప్రతినిధి రమేష్ సహయోగిని కలెక్టర్ అభినందించారు.జిల్లాలో హెచ్ఐవి / ఎయిడ్స్ నియంత్రణ కోసం వైద్య ఆరోగ్య శాఖ బృందం సమిష్టిగా చేసిన కృషి, అంకితభావం ప్రశంసనీయమని కలెక్టర్ పేర్కొన్నారు. ఇదే స్ఫూర్తితో మరింత సమర్థవంతంగా పనిచేస్తూ తదుపరి లక్ష్యమైన 'సురక్షిత్ ప్లస్ ' హోదాను సాధించాలని సూచించారు.హెచ్ఐవి నివారణ, వ్యాధి నిర్ధారణ పరీక్షలు, చికిత్స, బాధితులకు నిరంతర వైద్య సంరక్షణ అందించడంలో వైద్య ఆరోగ్య శాఖ కేంద్రం, బృందాలు, స్వచ్ఛంద సంస్థలు, ఇతర భాగస్వామ్య విభాగాల సమన్వయం కీలకమని ఈ సందర్భంగా పేర్కొన్నారు. జిల్లాలో హెచ్ఐవి / ఎయిడ్స్ నియంత్రణ సేవలను మరింత బలోపేతం చేస్తూ ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

ఆర్భాటాల కంటే ఆకలి తీర్చడంలోనే "అసలైన ఆనందం!"

- దివ్యాంగుల మధ్య బేతి మనోజ్ఞ జన్మదిన వేడుకలు..
- అన్నదానం, పండ్ల పంపిణీతో సేవా స్ఫూర్తి
- సేవే మానవత్వానికి ప్రతిరూపం.. పుట్టినరోజు వేడుకలు నిరుపేదలకు అండగా నిలిచేలా ఉండాలి
- ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ వరంగల్ జిల్లా చైర్మన్ బేతి అశోక్ బాబు

వరంగల్, నవంబర్ 02, (నేటి వెలుగు):

పుట్టినరోజు వేడుకలంటే హంగులు, ఆర్భాటాలు, ఖరీదైన విందులు మాత్రమే కాదు.. ఆకలితో ఉన్నవారి కడుపు నింపడం, ఆపన్నులకు అండగా నిలవడం, నలుగురి ముఖాల్లో చిరునవ్వులు పూయించడంలోనే అసలైన ఆనందం ఉందని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ వరంగల్ జిల్లా చైర్మన్ బేతి అశోక్ బాబు అన్నారు. వ్యక్తిగత వేడుకలను సామాజిక సేవకు వేదికగా మార్చుకోవడం ద్వారా మానవత్వాన్ని చాటుకోవచ్చని ఆయన పేర్కొన్నారు.కాశిబుగ్గలోని మదర్ తెరిసా ఫౌండేషన్‌లో బేతి మనోజ్ఞ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని దివ్యాంగుల మధ్య ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి, దివ్యాంగులకు పండ్ల పంపిణీ చేయడంతో పాటు అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని బేతి అశోక్ బాబు ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పుట్టినరోజు వేడుకలను కేవలం కుటుంబ సభ్యులు, స్నేహితుల మధ్య హంగులు, ఆర్భాటాలతో జరుపుకోవడం కంటే, సమాజంలో ఆదరణకు నోచుకోని నిరుపేదలు, దివ్యాంగులు, అనాథల మధ్య జరుపుకోవడం ఎంతో సంతృప్తినిస్తుందని అన్నారు. మన ఆనందంలో నలుగురిని భాగస్వాములను చేయడం, అవసరంలో ఉన్నవారికి చేయూతనివ్వడం కంటే గొప్ప వేడుక మరొకటి లేదని పేర్కొన్నారు.ఒక్కరోజు వేడుకల కోసం వేల రూపాయలు ఖర్చు చేసే బదులు.. ఆ డబ్బుతో ఆకలితో ఉన్న కొందరికి అన్నం పెట్టగలిగితే, నిరుపేద పిల్లలకు అవసరమైన వస్తువులు అందించగలిగితే, అనాథలకు అండగా నిలవగలిగితే అదే నిజమైన మానవత్వమని అశోక్ బాబు అభిప్రాయపడ్డారు. వేడుకల్లో చేసే ఖర్చు కంటే, వాటి ద్వారా ఎంతమంది జీవితాల్లో ఆనందాన్ని నింపగలిగామన్నదే ముఖ్యమని అన్నారు.సమాజంలో ప్రతి ఒక్కరూ తమ కుటుంబాల్లో జరిగే పుట్టినరోజులు, వివాహ వార్షికోత్సవాలు, ఇతర శుభకార్యాలను సేవా కార్యక్రమాలతో ముడిపెట్టుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఆడంబరాలకు, అనవసర ఖర్చులకు ప్రాధాన్యం ఇవ్వకుండా.. నిరుపేదలకు భోజనం అందించడం, పండ్లు, దుస్తులు పంపిణీ చేయడం, అనాథలకు అవసరమైన సహాయం చేయడం వంటి కార్యక్రమాలకు ముందుకు రావాలని కోరారు.సేవ చేయడానికి సంపదే ఉండాల్సిన అవసరం లేదని, మంచి మనసు ఉంటే చాలని ఆయన పేర్కొన్నారు. మనకు ఉన్నదాంట్లో కొంత ఇతరులకు పంచినప్పుడే సమాజంలో సోదరభావం, సమానత్వం, మానవీయ విలువలు పెంపొందుతాయని తెలిపారు.బేతి మనోజ్ఞ జన్మదిన వేడుకలను దివ్యాంగుల మధ్య నిర్వహించడం ద్వారా కుటుంబ సభ్యులు సేవాభావాన్ని చాటుకున్నారని, ఇలాంటి కార్యక్రమాలు ఇతరులకు స్ఫూర్తిగా నిలవాలని అశోక్ బాబు ఆకాంక్షించారు.

సమాజానికి సందేశం ఇదే..

పుట్టినరోజు వేడుకల సందర్భంగా వెలిగించే కొవ్వొత్తుల కాంతి కాసేపే ఉంటుంది.. కానీ, ఆకలితో ఉన్నవారికి పెట్టే అన్నం వారి హృదయాల్లో చిరకాలం నిలిచిపోతుంది. మన వేడుకలు ఇతరుల జీవితాల్లో వెలుగులు నింపినప్పుడే వాటికి నిజమైన అర్థం ఉంటుంది. ప్రతి శుభకార్యాన్ని ఒక సేవా కార్యక్రమంగా మార్చుకుని, నిరుపేదలు, దివ్యాంగులు, అనాథలకు అండగా నిలవడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యతగా భావించాలని ఈ కార్యక్రమం చాటి చెప్పింది.ఈ కార్యక్రమంలో బేతి వీరలక్ష్మి, బేతి రాజు, బేతి శ్వేత, బేతి శోభారాణి, బేతి దివ్య, బేతి సాయి, బేతి నాని చారి, మదర్ తెరిసా ఫౌండేషన్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



తుపాను ఎఫెక్ట్.. సూర్యాపేట జిల్లాకు హై అలర్ట్





- నేటి సాయంత్రం 4 నుంచి రేపు మధ్యాహ్నం వరకు ప్రయాణాలు బంద్ చేయాలి
- గంటకు 80 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం
- అధికారులతో కలెక్టర్ అత్యవసర వెబెక్స్ సమావేశం.. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచన

సూర్యాపేట నవంబర్ 02 (నేటి వెలుగు):

బంగాళాఖాతంలో ఏర్పడుతున్న తుపాను ప్రభావం సూర్యాపేట జిల్లాపై ఉండే అవకాశం ఉందని కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ సూచించారు. జిల్లాలో బలమైన ఈదురుగాలులతో కూడిన భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ అంచనా వేసినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులతో పాటు క్షేత్రస్థాయి సిబ్బందితో కలెక్టర్ అత్యవసర వెబెక్స్ సమావేశం నిర్వహించారు.

గంటకు 80 కిలోమీటర్ల వేగంతో గాలులు

తుపాను ప్రభావంతో జిల్లాలో గాలుల వేగం క్రమంగా పెరిగే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. సోమవారం మధ్యాహ్నం గంటకు 40 నుంచి 50 కిలోమీటర్లు, అర్ధరాత్రి 55 నుంచి 65 కిలోమీటర్లు, మంగళవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు 70 నుంచి 80 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని సమావేశంలో వివరించారు.

సాయంత్రం 4 నుంచి ప్రయాణాలు వద్దు

తుపాను ప్రభావం నేపథ్యంలో అత్యవసరమైతే తప్ప ప్రజలు ప్రయాణాలు చేయొద్దని కలెక్టర్ సూచించారు. సాయంత్రం 4 గంటల నుంచి మరుసటి రోజు మధ్యాహ్నం 12 గంటల వరకు ద్విచక్ర వాహనాలు, కార్లు, భారీ వాహనాల రాకపోకలను వీలైనంత వరకు నిలిపివేయాలన్నారు. చెట్లు, విద్యుత్ స్తంభాలు, హోర్డింగులు, ప్రమాదకర నిర్మాణాల దగ్గర ఉండొద్దని హెచ్చరించారు.

లోతట్టు ప్రాంతాలపై ప్రత్యేక నిఘా

లోతట్టు ప్రాంతాలు, వరద ముంపు గ్రామాలు, బలహీనమైన భవనాలను గుర్తించి అక్కడి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని అధికారులను ఆదేశించారు. గుడిసెలు, తాత్కాలిక పెట్లలో నివసించే వారిని పక్కా భవనాలకు తరలించాలన్నారు. ప్రతి గ్రామంలో ఎత్తైన ప్రాంతంలో ఉన్న ప్రభుత్వ భవనాన్ని సురక్షిత ఆశ్రయ కేంద్రంగా గుర్తించాలని సూచించారు. వృద్ధులు, చిన్నపిల్లలు, గర్భిణులు, దివ్యాంగులకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు.

స్కూళ్లకు ముందస్తు ఆదేశాలు

విద్యార్థుల భద్రత దృష్ట్యా మధ్యాహ్న భోజనం తర్వాత స్కూళ్లకు సెలవు ప్రకటించి పిల్లలను ఇళ్లకు పంపించాలని విద్యాశాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలతో పాటు టీచర్లు కూడా ఇంటికి వెళ్లాలని సూచించారు.

24 గంటలు అందుబాటులో అధికారులు

రెవెన్యూ, పోలీస్, విద్యుత్, ఇరిగేషన్, మున్సిపల్, పంచాయతీరాజ్, వైద్య, వ్యవసాయ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. రిజర్వాయర్లు, చెరువులు, కట్టలు, కాల్వల నీటిమట్టాలను ఇరిగేషన్ అధికారులు నిరంతరం పర్యవేక్షించాల న్నారు. విద్యుత్ అంతరాయాలు ఏర్పడితే వెంటనే పునరుద్ధరించేందుకు ప్రత్యేక బృందాలను సిద్ధంగా ఉంచాలని సూచించారు.

గంటగంటకు పరిస్థితిపై నివేదిక

జిల్లాలో పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రతి కీలక శాఖ నుంచి ఒక అధికారిని కంట్రోల్ రూమ్‌లో 24 గంటల పాటు అందుబాటులో ఉంచాలని సూచించారు. సోమవారం మధ్యాహ్నం 3 గంటల నుంచి మరుసటి రోజు మధ్యాహ్నం 12 గంటల వరకు ప్రతి గంటకు పరిస్థితిపై నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమం లో ఎస్పీ నరసింహ, అదనపు కలెక్టర్ బి. హరిసింగ్, డిఆర్ఓ ప్రేమ్ రాజ్, వెంకటరమణ, డీఈఓ శ్రీనివాస్, పశుసంవర్ధక శాఖ డిడి శ్రీనివాసరావు, డిఎస్ఓ మోహన్ బాబు, ఆర్టీవో పురుషోత్తం రెడ్డి, డిఐఈఓ సులోచన రాణి, ఆడిట్ ఆఫీసర్ శ్యామ్, డిటిడిఓ ఇరిగేషన్ ఫైర్ ఇతర సంబంధిత శాఖలు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ అణచివేత చర్యలకు వ్యతిరేకంగా జర్నలిస్టులంతా ఐక్యం కావాలి!





- మీడియా స్వేచ్ఛను హరించే కుట్రలను ప్రతిఘటించాలి
- పంజాబ్--చండీగఢ్ జర్నలిస్టు యూనియన్ 13వ వ్యవస్థాపక వార్షికోత్సవంలో వక్తల పిలుపు

లూథియానా, నవంబర్ 1(నేటి వెలుగు)

దాడులు, బెదిరింపులు, తప్పుడు కేసులు, అరెస్టులు, నిర్బంధాలు, ఆంక్షలతో మీడియా గొంతు నొక్కేందుకు జరుగుతున్న ప్రభుత్వ ప్రయత్నాలను జర్నలిస్టులంతా ఐక్యంగా ప్రతిఘటించాలని పలువురు జాతీయస్థాయి జర్నలిస్టు, మేధావి నాయకులు పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్యానికి నాలుగో స్తంభమైన మీడియా స్వేచ్ఛను కాపాడుకోవడానికి పాత్రికేయుల ఐక్యతే ప్రధాన ఆయుధమని స్పష్టం చేశారు.పంజాబ్--చండీగఢ్ జర్నలిస్టు యూనియన్ 13వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు శనివారం లూథియానాలోని బి.ఆర్. అంబేద్కర్ భవన్‌లో ఘనంగా జరిగాయి. గదర్ పత్రిక సంపాదకుడు, విప్లవకారుడు షహీద్ కర్తార్ సింగ్ సరాభాకు అంకితంగా నిర్వహించిన ఈ కార్యక్రమానికి పంజాబ్‌లోని 22 జిల్లాల నుంచి 250 మందికి పైగా జర్నలిస్టులు హాజరయ్యారు. తొలుత కర్తార్ సింగ్ సరాభా చిత్రపటానికి అతిథులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పోలీసు, పౌర యంత్రాంగాలను ఉపయోగించుకుని జర్నలిస్టులను భయభ్రాంతులకు గురిచేయడం ఆందోళనకరమన్నారు. ప్రభుత్వ విధానాలను ప్రశ్నించే మీడియాపై దాడులు, తప్పుడు కేసులు, వేధింపులు పెరుగుతున్నాయని విమర్శించారు. సమాచార వ్యవస్థను తమ నియంత్రణలోకి తెచ్చుకునేందుకు కేంద్ర ప్రభుత్వం వివిధ చట్టాలు, నిబంధనలను తీసుకొస్తోందని ఆరోపించారు.డిజిటల్ పర్సనల్ డేటా ప్రొటెక్షన్ చట్టంలోని నిబంధనలు జర్నలిజం స్వేచ్ఛకు ఇబ్బందులు కలిగించే ప్రమాదం ఉందని వక్తలు ఆందోళన వ్యక్తం చేశారు. వార్తా కథనాల ప్రచురణ, ప్రసారాల విషయంలో జర్నలిస్టులకు అనవసరమైన ఆంక్షలు విధించే పరిస్థితులు ఏర్పడితే పరిశోధనాత్మక జర్నలిజం దెబ్బతింటుందని పేర్కొన్నారు. జర్నలిజం రంగానికి తగిన మినహాయింపులు కల్పించాలని డిమాండ్ చేశారు.ప్రముఖ మేధావి, బాబా ఫరీద్ విశ్వవిద్యాలయ మాజీ రిజిస్ట్రార్ డాక్టర్ ప్యారా లాల్ గర్గ్, పంజాబ్ విశ్వవిద్యాలయ సెనేట్ సభ్యుడు డాక్టర్ సుఖ్‌దేవ్ సింగ్ సిర్సా, ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ (జాతీయ అధ్యక్షుడు బల్వీందర్ సింగ్ జమ్మూ, ఐజేయూ సెక్రటరీ జనరల్ డి. సోమసుందర్, మాజీ అధ్యక్షుడు ఎస్.ఎన్. సిన్హా, వ్యవసాయ విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ డాక్టర్ హెచ్.ఎస్. ధలీవాల్ తదితరులు ప్రసంగించారు.బల్వీందర్ సింగ్ జమ్మూ మాట్లాడుతూలి దేశవ్యాప్తంగా మీడియాను అణచివేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ పద్ధతులను అనుసరిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద నిరసనలను కవర్ చేస్తున్న జర్నలిస్టులు, ముఖ్యంగా మహిళా పాత్రికేయులపై జరిగిన పోలీసుల వేధింపులు, దాడులు, అరెస్టులను ప్రస్తావించారు. జర్నలిస్టులు తమ గుర్తింపు కార్డులు చూపించినప్పటికీ పోలీసులు పట్టించుకోకుండా వ్యవహరించడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమన్నారు.మీడియాను మత ప్రాతిపదికన విభజించే ప్రయత్నాలు కూడా ప్రమాదకరమని, మహిళా జర్నలిస్టులపై జరిగిన దాడులు పోలీసు వ్యవస్థలో పెరుగుతున్న వివక్షాపూరిత వైఖరికి నిదర్శనమని అన్నారు.

పంజాబ్‌లో జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించడంలో ఆమ్ ఆద్మీ పార్టీ ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. ప్రభుత్వ ప్రకటనలను మీడియా స్వేచ్ఛను నియంత్రించే సాధనంగా ఉపయోగించకూడదని హితవు పలికారు.ఐజేయూ సెక్రటరీ జనరల్ డి. సోమసుందర్ మాట్లాడుతూలి మీడియా రంగంలో పెట్టుబడులు పెరుగుతున్నప్పటికీ పనిచేస్తున్న జర్నలిస్టుల వేతనాలు మాత్రం దారుణంగా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గత రెండు దశాబ్దాలుగా వేతన సవరణకు నోచుకోకపోవడం, అధ్వాన్నమైన పని పరిస్థితులు జర్నలిస్టులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయన్నారు. వర్కింగ్ జర్నలిస్టుల చట్టాన్ని పునరుద్ధరించాలని, వేజ్ బోర్డును ఏర్పాటు చేయాలని, జర్నలిస్టుల రక్షణ కోసం ప్రత్యేక చట్టాన్ని తీసుకురావాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.18 ఏళ్ల పిన్న వయసులోనే బ్రిటిష్ పాలకుల చేతిలో ఉరికంబం ఎక్కిన గదర్ విప్లవకారుడు షహీద్ కర్తార్ సింగ్ సరాభా త్యాగం దేశవ్యాప్తంగా యువతకు స్ఫూర్తిదాయకమని తెలిపారు. స్వాతంత్ర్యోద్యమ కాలంలో గదర్ పార్టీ ప్రభావం ఆంధ్ర ప్రాంతంపైనా ఉందని, తెలుగు విప్లవకారుడు దర్శి చెంచయ్య ఆ పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొన్నారని గుర్తుచేశారు. భగత్ సింగ్, రాజగురు, సుఖదేవ్ వంటి విప్లవ వీరుల త్యాగాలు తెలుగు ప్రజలకు కూడా స్ఫూర్తినిస్తున్నాయని వివరించారు.జాతీయ స్థాయిలో వర్కింగ్ జర్నలిస్టుల ఉద్యమాన్ని మరింత బలోపేతం చేయడంలో పంజాబ్--చండీగఢ్ జర్నలిస్టు యూనియన్ క్రియాశీల పాత్ర పోషించాలని ఆకాంక్షించారు.యూనియన్ రాష్ట్ర చైర్మన్ బల్బీర్ సింగ్ జండు, అధ్యక్షుడు జై సింగ్ ఛిబ్బర్, ప్రధాన కార్యదర్శి సంతోఖ్ గిల్ మాట్లాడుతూ నవంబర్ 16 జాతీయ పత్రికా దినోత్సవం సందర్భంగా నవంబర్ 16 నుంచి 23 వరకు వివిధ కార్యక్రమాలు నిర్వహించాలని, షహీద్ కర్తార్ సింగ్ సరాభా వర్ధంతిని ఘనంగా జరపాలని జర్నలిస్టులకు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో యూనియన్ కోశాధికారి బిందు సింగ్, జగ్తార్ భుల్లర్, జగ్తార్ సిద్ధూ, సుఖ్‌నైబ్ సిద్ధూ, జగ్సీర్ సంధు, తేజిందర్ థిండ్ తదితరులు పాల్గొన్నారు. యూనియన్ వ్యవస్థాపక కమిటీ సభ్యులు, సీనియర్ పాత్రికేయులను ఘనంగా సత్కరించారు.



Edited, Published and owned by **PAMANAGUDNDLA NAVEEN KUMAR,** Printed at **SRI printers** at H.No. 1-47/1, Ganesh Nagar, Dandampelly, Nalgonda , Telangana State : Editor, **PAMANAGUDNDLA NAVEEN KUMAR** : **RNI No. TELTEL 2023/88559**, Cell : **9553276552,**